వణుకుతూంది. నెమ్మదిగా ఆ ఉత్తరాన్నంతా కాపీ చేశాడు. సంతకం చేశాడు

శుద్ధకీర్తి చటుక్కున తండ్రి చేతిలోంచి ఆ కాగితాన్ని లాక్కున్నాడు దాన్ని వీక్లీలో పెట్టి, వీక్లీకి కాగితం చుట్టి, దానిమీద అడ్రసు రాశాడు. ఆ వీక్లీని, వంద కాగితాన్ని పట్టుకుని ఆదరా బాదరా పోస్టాఫీసుకి వెళ్ళిపోయాడు. కావ్యకంఠాన్ని మినహాయించి అందరి మొహాల్లోనూ ఆనందం తాండవించింది.

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 18-8-82)

★★★ ★★★ ★★★

# నేనూ-సుందరీ-శవమూ

మా ఎదుటి సీటు కిందికి చూపిస్తూ హఠాత్తుగా సుందరి- " ఏమండీ.. ఏవండీ అటు చూడండి - అదేంటంటారు?" అనడిగింది నన్ను నేను చూశాను. అది గోనె మూట. ధాన్యమూ, బట్టలూ, దూదీ వగైరా ఉన్న మూట కాదు. ఇంకేదో బరువైనదీ, పొడుగైనదీ అయిన వస్తువున్నమూట.ఆ వస్తువేమిటో నాకు స్ఫురించలేదు." ఏమో ఏమిటి" అన్నాను. సుందరి లోగొంతుతో అంది : " శవం లాగా లేదూ? శవమండీ శవమే!" ఆమె గొంతులో దాని భయమూ, ఆదుర్దా తొంగి చూశాయి. నేను కొద్దిగా బెదిరాను. అయినా తమాయించుకున్నాను. " శవమేమిటి, నీ మొహం! రైల్లోకి శవం ఎట్లా ఎక్కుతుంది - మన మిక్కడ కూర్చోనుండగా?" అన్నాను. సరిగ్గా చూపులతోను మరోసారి పరిశీలించాను మూటని, మనిషి మొండెం నించి కాళ్ళూ చేతులూ వేరు చేసి వాటిని మొండెం పైనే వేసి కట్టి నట్టు కనిపిస్తుంది. తల మొండానికి అంటుకునే ఉంది. గోనె సంచీ అంచులు కలిపి కుట్టి ఉన్నాయి. తల పైభాగాన సంచీ మామూలుగా తాడుతో బిగించి కట్టి ఉంది. అసలింత అర్ధరాత్రి వేళ మా ప్రయాణానికి కారణం లేకపోలేదు. రచయిత్రిగా సుందరికి పేరుంది. ఇటీవల ఆమె కథకి బహుమతి రావటంతో ఆ పేరు ఇనుమడించింది.' పాతాళ లోకంలో భూతాల శోకం' 'ఈరాత్రికీ రక్తంచాలు' అనే నవలలూ 'చేతబడిలో శవం పాత్ర' అనే సీరియల్ వ్యాసమూ పాఠకజనాన్ని భూకంపం వూపినట్టు వూపేశాయి. దాంతో 'పిరసం' వాళ్ళు (పిశాచ రచనాభిమాన సంఘం' ) వాళ్ళుగుంటూర్లో ఆమెకి సన్మానం ఏర్పాటు చేశారు.ఆహ్వాన లేఖ రాగానే దాని మీది ఈ సంఘం పేరు చూసి సుందరి మొదట్లో కంగారు పడింది. అది'పిశాచరచయితల సంఘం' అనుకుంది. కానీ ఆ సెక్రటరీ ఎవరో వచ్చి కలిసి వివరించాక , నేను హామీకూడా ఇచ్చాక ఒప్పుకుంది. ఇప్పుడు బయలుదేరింది.

రాత్రి ఎనిమిది గంటలకు పవరుపేట స్టేషన్లో వాల్తేరు - విజయవాడ పాసింజరు బండీ ఎక్కాం. అది తక్కుతూ తారుతూ తొమ్మిదిన్నరకి గన్నవరం చేరింది. అక్కడ ఎవరో జమా జెట్టీల్లాంటి వాళ్ళుఎక్కించారు. ఈ మూటని మాపెట్టెలోకి ఆ తరవాత ఎటో వెళ్లారు. వాళ్ళు ఈ మూట నెక్కించటం నేను చూశాను కానీ, అప్పుడు కిటకీలోంచి బయటికి చూస్తున్న సుందరి మాత్రం చూడలేదు.బండి బయలుదేరి స్పీడందుకున్నాక ఇప్పటికి ఆమె దృష్టి మూట మీద పడింది. దృష్టి పడటమేమిటి, ఆమె కంగారు పడటమేమిటి. ఈ రెండూ ఏక కాలమందు జరిగిపోయాయి ఉండుండి " అవునంటారా?"

అనితిగంది సుందరి నా మొహంలోకి మొహం పెట్టి " ఏమిటీ సీగోల! అటు వైపు చూడకు జయటక చూడు" అన్నాడు అన్నానే కాని శవాల్ని గురించిన ఆలోచనలు నాలో సాగుతున్నాయి కాస్తో కూస్తో రచనా సామర్థ్యమున్న రచయితలు, రచయిత్రులు శవాల్ని గురించి అడ్డంగా రాసేసి పాఠకుల్లో ఉన్న మూఢ విశ్వాసాల్ని రెచ్చగొడుతున్నారు. ఏ సాహిత్యమైనా ఒకే పక్కీలో అతిగా సాగితే మనిషిలోని ఆలోచనాశక్తిని, ఆత్మవిశ్వాసాన్ని నాశనం చేసి, మనిషిని నిర్వీర్యుణ్ణి చేస్తుందనేది నా నమ్మకం. ఇప్పుడూ అంతకంతకూ ఎక్కువై పోతున్న శవ భూత చేతబడి సాహిత్యం చేస్తున్నదైనా ఇంతేను ఇంతకీ, శవసాహిత్య రచనా ధురంధర అయిన నా సుందరేనా మూటను చూసి శవ మనుకుంటున్నదీ!

పట్టాలు రిపేర్లో ఉన్నట్లున్నాయి కుదుపుతో బండి నెమ్మదిగా నడుస్తూంది. రిపేర్ల జనమూ ఫ్లడ్ లైట్లూ వెనకబడి బండి స్పీడందుకుంటుండగా సుందరిగావుకేక పెట్టింది.

" కదులుతూందండీ శవం కదులుతూందండీ" అని అరవటమే కాదు. నన్ను హఠాత్తుగా వాటేసుకుంది కూడా! నేను ఉలిక్కిపడ్డాను. చూద్దునుకదా, ఆ మూట కొద్దిగా అటూ, ఇటూ కదులుతూన్నమాట వాస్తవం. నాలుగైదుసార్లు వూగి అది ఆగిపోయింది. " నీ మొహం. బండి స్పీడుకు అది వూగింది అంతే. వూరికే నీ మనస్సు పాడు చేసుకుని, నా మనస్సు పాడు చెయ్యకు. అన్నాను. సుందరి నన్ను వదిలేసింది మూట వైపు అనుమానంగా చూస్తూ... " ఏమోనండీ, నాకు భయం వేస్తోంది" అంది. " నీకు భయమేమిటి? బేతాళకతలు రాశావు. శవం కథలు రాశావు. చేతబడుల మీద గ్రిసెర్చి వ్యాసమే దింపేవావు. నువ్వుఅనాల్సిన మాటలేనా ఇవి?" ... " రాస్తే? రాయటం వేరు, అనుభవం వేరు. అయినా రాశాను కానీ చేస్తానన్నానా? అక్కడాకూడా చదివింది, విన్నదీ, కాస్త వూహా కలిపితే వ్యాసమయి పోయె, కథయిపోయె, దీనికి పెద్దకష్టపడేదేమిటి? " ... " మరి నువ్వు శ్మశానంలో శవం మీద కూర్చుని మంత్రం జపించినట్టు, ఆ మహిమ వల్ల ఆ తరవాత ఇంట్లో గది తలుపులు తియ్యగానే ప్రేతం నీకు కనబడి నీతో మాట్లాడినట్టు, మిట్టమధ్యాహ్నం నీ కారు బానెట్ మీద కొచ్చి కూర్చుని కదలనివ్వనట్టు, నువ్వు ఫో అనంగా అది పోయినట్టు . . ఏంటేంటో రాసేశావ్- కనీసం నువ్వు శ్మశానానికి వెళ్ళి చూడనయినా చూడకుండా రాసెయ్యటం అన్యాయయమని నువ్వు అనుకోవటం లేదా? శ్మశానంలో తగలబడుతూండే శవాలు నక్కలు ,అవి పైకి తవ్వేసి పీకేసిన పసిపిల్లల పుర్రెలు, జుట్టు, సగం కాలిన కట్టెలు! వీటినసలు నిజంగా నువ్వు ." ... " బాబోయ్! అవ్వన్నీ చెప్పకండిప్పుడు అసలే భయంతో ఛస్తుంటే ఇంకా చంపుతారేంటి?"..."మరి నువ్వు చంపిన పాఠకుల మాటేమిటి? ముగ్గురు నిన్ను తన్నటానికొచ్చారు ఇద్దరు పిచ్చాళ్ళు అయిపోయారు. ఇంకో ఇద్దరు క్రిష్ణ కాలవలో చచ్చారు. అందుకే కదూ నీకీ సన్మానం!" " ఆహా, వాళ్లు చచ్చేంత భయంకరంగా రాశావు నీ బుర్రలో పుట్టిన పరిశ్రుభమూ, పరిపూర్ణమూ పూర్తి కల్పనము అయిన బస్తాల కొద్దీ చెత్తను దస్తాల కొద్దీ కాగితాల్లో నింపావు. అందుకే అనుకో." ... " నాకు తోచింది నేను రాశాను. చదవమని ఎవడన్నాడు. చావమని ఏవడేడ్చాడు సన్మానాలు చెయ్యమని ఇంకెవడు బతిమాలాడు?"

" పాఠకుల అజ్ఞానాన్ని కాష్ చేసుకోవాలనుకోవటం మంచిదే నంటావ్ ? వూహ! రామ, రామ! "రామ రామేంటి?" . "పాపం పాఠకులు! నీభూతప్రేతపిశాచ, శాకినీ , డాకినీ, హాకినీ రచనల్నుంచి వాళ్లమెదళ్ళు ఎప్పుడు విముక్తాలవుతాయోగదా" " సర్లెండి! రాక రాక 'సన్మానం ఛాన్సు వచ్చిందనే గుర్తింపులేదు. నలుగురు పిల్లలతో సతమతమవుతూనే రాయగలుగుతున్నానే గౌరవం లేదు మూన్నెళ్ళ

ఎడబాటు తరవాత ఒకళ్ళ నొకళ్లం క్షమించుకుని కలుసుకున్నామన్న ఇంగితం లేదు పైగా ఎదురు దెబ్బళ్లు! రేపు సభలో మిమ్మల్ని మాట్లాడమని వాళ్లంటే ఇట్లాగే మాట్లాడతారా? నా పరువు నాగులేట్లో ముంచేస్తారా? ఖర్మ." సుందరి గొంతులో జీర ధ్వనించింది ఆమె మొహంలో కోపం అవమానాలతో బాటు కళ్ళల్లో నీళ్ళుకూడా తొంగి చూశాయి. ఇంత గొప్ప రచయిత్రి ఒక్కసారిగా బెంబేలు పడిపోవటం నాకే చిన్నతనమనిపించింది. నేను సానునయంగా ఆమె భుజం మీద చెయ్యేసి దగ్గరకు తీసుకోబోయాను. చటుక్కున ఆమె " చాల్లెండి" అంటూ కిటికీ వైపు విసురుగా జరిగింది గుడ్ల నీరు కుక్కుకుంటూ. ఈ మా గొడవలో పురుషోత్తపట్నం స్టేషను ఎప్పుడు వెళ్ళి పోయిందో వెళ్లిపోయింది మేమిద్దరం మవునంగా ఉండిపోయాం.

పది నిమిషాలు గడిచాయి. పెళ్ళివారి నడకతో బండి వచ్చి ముస్తాబాద్ స్టేషన్లో ఆగింది యాధాలాపంగా నేను బయటికి చూశాను ప్లాట్ ఫారం మీద నా డిగ్రీ క్లాస్‌మేట్ అగ్నిస్ అర్బత్‌నాట్ నిలబడున్నాడు. అతను గార్డుగా పని చేస్తున్నాడని తెలుసు కానీ, ఇట్లా ఈ బండికే జెండాలూపుకుంటూ తగులుతాడని ఎన్నడూ వూహించలేదు. నేను చటుక్కున లేచి రాబోతూ సుందరి వైపు చూశాను ఆమె ఆ మూట వైపే చూస్తోంది. కంగారుగా నాచెయ్యిపట్టుకుని " ఎక్కడికి?" అంది.

"అడుగో మా ఫ్రెండు అర్బత్‌నాట్ ఈ బండి గార్డే" అన్నాను. ..." అయితే, ఈ శవం విషయం అదే ఈ మూట విషయం చెప్పండి. ప్లీజ్. తొందరగా వచ్చేయండి. బండి ఎక్కువ సేపు ఆగదండీ." " శవమా, నీ మొహమా ... నోర్మూయ్యి' విసుగ్గా లేచి నేను ప్లాట్ ఫారం మీదికి దిగాను. అర్బత్‌నాటూ, నేనూ పరస్పరం విష్ చేసుకున్నాం. అతను నన్ను చూసి ఆనంద పడ్డాడు. మిరప్పళ్ళ బస్తా లోడింగుందనీ, పది నిమిషాలు ఆలస్యముంటుందనీ అతనన్నాడు. మేమిద్దరం పిచ్చాపాటిలో పడ్డాం. ఇందాకన మా పెట్టెలోకి మూట ఎక్కించిన ఆ ఇద్దరు జమా జెట్టీలూ ఇప్పుడు మాకు పది గజాల దూరంలో నుంచొని మా ఇద్దర్నీ తీక్షణంగా పరిశీలిస్తున్నారు. నేను పట్టించుకోలేదు. అయిదారు నిమిషాలయ్యాక - "రా మన ఫ్రెండు దగ్గర టీ తాగొద్దాం" అన్నాడు అర్బత్ నాట్." ఇప్పుడుటీ ఎక్కడదొరుకుతుంది?" అనంటూనే నేను అతన్ని అనుసరించాను. స్టేషను మాస్టరు రూంలో కెళ్లాం. అర్బత్‌నాట్ స్టేషను మాస్టరుకి నన్ను పరిచయం చేశాడు. అతను మా ఇద్దరికీ తన ప్లాస్కులో మిగిలిన టీ పంచిచ్చాడు. మళ్ళీ అక్కడ కాస్సేపు పిచ్చా పాటీ నడిచింది.నేను బండీ కేసీ స్టేషను మాస్టరు గది గోడ వేపుగా చేతులు వూపుతూ " ఇన్ని గూడ్సు పెట్టెలెందుకు?" అనడిగాను. " ఎంప్టీవి. షెడ్‌కు రిటర్న్ చేస్తున్నాం. " అన్నాడు అతను. ఇంతలో కూలీ లొచ్చి " అయింది, సార్" అన్నారు. మేమిద్దరం కదిలాం. అప్పుడు చూశాను. ఆగోడ కిందే చీకట్లో నుంచునున్న జమా జెట్టీల్ని వాళ్ళు ఇంత సేపూ ఇక్కడ నక్కి మా సంభాషణ వింటున్నారు! నాకు తికమక అయింది. నేను వాళ్లను చూట్టం చూసి వాళ్లు బెదరలేదు. పైపెచ్చు వాళ్ళే నావైపు కొరకొరా చూస్తూ నడిచారు మా వెనక. మేమిద్దరం విడిపోయాం నా పెట్టెను నేను ఎక్కిన డోర్‌లోంచి కాక అవతల చివర డోర్‌లోంచి వాళ్ళెక్కారు. బండి బయలుదేరింది. ఇంతసేపూ నా నుంచి వియోగం అనుభవించడంతో కోపం పోయి మళ్లీ భయం ఆమెలో చోటు చేసుకున్నట్టుంది సుందరి అడిగింది. । " చెప్పలేదు కదూ?" అని నేను తల అడ్డంగా తిప్పాను నేను కూర్చోగానే నిట్టూర్పు విడుస్తూ ఆమె నన్నానుకుని కూర్చుంది మా మధ్య మాటలు మాత్రం మృగ్యం నాలుగైదు నిమిషాలు గడచాయి. పెట్టెలో రెండో వైపు నుంచి ఇద్దరి మధ్యవయస్కులొచ్చి మా సీటర్లకు పక్కన కాళీగా ఉన్న ఎదురు

ఎదురు సీట్లలో కూర్చున్నారు. మొదటివాడన్నాడు " ఏమిటీ, హత్యా ఎక్కడా?" రెండో వాడన్నాడు , "చిరివాడలో మీ కింకా తెలీదంట్రా?"... " ఎప్పుడు" ... " నిన్న రాత్రి. పాల యాపారం నాగిరెడ్డి లేడూ అడు దొంగోడ్ని హత్య చేసేశాడు. అసలేం జరిగిందంటే. ." రెండవ వాడు చేతిలో చుట్ట నోట్లో పెట్టుకుని అగ్గిపెట్టె కోసం చొక్కా జేబు తడుముకున్నాడు. అంతవరకూ ఎటో చూస్తూన్న సుందరి కుతూహలంగా వీళ్ళవైపు తిరిగి వినసాగింది. చెప్పొద్దూ నేనుకూడా అదే యావలో పడ్డాను. చుట్ట వెలిగించుకుని రెండవ వాడు మొదలు పెట్టాడు. " నాగిరెడ్డి ఆడి తండ్రితో ఏర్లుపడి వూరు సివర తెలప్రోలు రోడ్డులో పొలంలో ఇల్లేసుకుని ఉంటన్నాడు. మొన్న రాత్రి ఆడురెండో ఆట సినిమా కెళ్ళొచ్చి తలుపు తీసుకుని ఇంట్లో కెళతా ఉంటే సూరుకింద సీకట్లో నక్కి కూసున్న ఒక దొంగెదవ లోనికిసటుక్కున తోసుకొచ్చి, కత్తి సూపిచ్చి ఇనప్పెట్టె తాళాలిమ్మన్నాడు. నాగిరెడ్డి కాస్సేపు ఆలోసించాడు. పెళ్లాం, పిల్లలు లోన నిద్దర బోతున్నారు అరిస్తే పలికే పోడు లేడు. లగెత్తుకు పోదావన్నా ఇల్లు వూరు సివరుంది. అందుకని తాళం చెవిని సైలెంటుగా కిందికిసిరేశాడంట దొంగోడు దాన్నందుకున్నపుడు సటుక్కున నాగిరెడ్డి తలుప్పక్కున్న పలుగందుకొని అడియాపులో కస్సున దించాడంట. అది ఆడి గుండెల్లోంచి దూసుకు బోయి నేల గుచ్చుకున్నదంట. ఈ అరుపులకి పెళ్లాం లేచి సూసి కెవ్వున అరిసి మతి తప్పి పడిపోయిందంట... " ఆ!వొర్నాయినో! ఆడు సచ్చాడా? " ... " సావకేం జేత్తాడు. ఆడనే పడిపోయి గిలగిలా తన్నుకొని సచ్చాడు." అప్పటికి ఈ నాగిరెడ్డికి ఇదెంత గొడవవుద్దోని బయం పట్టుకుంది. అందుకని వూళ్లో కెళ్లి తన స్నేహితుల్ని తీసుకొచ్చాడు. ఇద్దరూ కలిసి శవాన్ని గోనె సంచీలో యేసి మూటకట్టారు ఆ మూటని మామిడితోట పక్కకు తీసి కెళ్ళారు. పలుగులూ పారలూ తీసి కెళ్ళి గొయ్యి తవ్వటం మొదలు పెట్టారు. ఇంతలోకి మామిడి తోట కాపలా ఉన్నాడు సటుక్కున బాట్రీ లైటేసి ఈల్లని సూసాడు. ఈల్లు బెదిరిపోయారు. తప్పించుకుని పారిపోయ్యారు."

" మరయితే ఆ మూట యామయింది. ఆ ల్లేమయ్యారు?" ... " అల్లిద్దరూ, అట్నుంచి అటే ఎటో పారిపోయ్యారు. ఆ మూట ఆల్లే ఎక్కడికో మోసేశారు. ఆ తోట కాపలా వాడొచ్చీ ఆడి పెళ్లాం దగ్గిర గుస గుస లాడితే తెల్లారేపాటికి ఆ వూసు వూల్లో అందరి పెళ్ళాలకీ పాకిపోయింది. ఇయ్యాల మద్దినేలకి తెలప్రోలు పోలీసులు రావటం, నాగిరెడ్డి పెళ్ళాన్నీ ప్రశ్నలడగటం , వూళ్లో పొలాలన్నీ యతకటం అంతా మామూలుగా జరిగిపోయింది. కానీ ఎక్కడా మూట దొరకలా, ఆ మనుషులూ దొరకలా!" నేను చటుక్కున సుందరి వైపు చూశాను. సుందరి నా వైపూ మూట వైపూ మార్చి మార్చి చూసింది. నా కుడి చేతిని తన చేతుల్లోకి తీసుకుంది క్రమంగా ఆమె చేతులు బిగుసుకుంటున్నాయి. మొహంలో కంగారెక్కువవుతూంది. ఉండుండి మొదటి వాడు నిట్టూర్చాడు. " ఏందో ఎదవ గోల, రోజుకో సావు, పూటకో హత్య ఎప్పుడే కబురింటామో తెలీదు గంద" . " ఏదో కబురింటమేంటి, మన దీపాలే ఎప్పుడారిపోతయ్యో సెప్పలేం గదరా. బామ్మర్దీ! అసలిప్పుడు ఈ పెట్టెలోనే ఎవుడన్నా మనకి కత్తి సూపిత్తే దిక్కేంటుంట? మన్నగ్గిరేం లేదనుకో." ... " అవునవును, యాం జేత్తాం!"

రెండో వాడు ఆరిపోయిన చుట్టను మళ్ళీవెలిగించుకున్నాడు. బండి ముస్తాబాద్‌లో ఆగింది. ఆ ఇద్దరూ దిగిపోయారు. హఠాత్తుగా భుజం వూపేస్తూ సుందరి అంది. " ఈ మూట ఆ శవమే నండి. నాకేదో భయంగా వుంది సీటు మారి పోదాం పదండి. సీటు మారదామన్న ఆలోచన నా క్కూడా రావటం అత్యంత నిజం. అయితే అది అంతసులభం కాదు. ఎందుకంటే మాతోబండెక్కిన మా సామాను కాస్తా కూస్తా కాదు.

దాన్ని మా సీటరు కిందా పైబెర్తుమీదా చచ్చేట్టు ఇందాకన సర్దాము, అదే సుందరితో అన్నాను

"గుంటూర్లో అయితే పాత బట్టలికి కొత్త స్టీలు కొండొంతస్తుందని రెండు సూట్ కేసుల నిండా తెస్తున్నావు మీ అయ్య కిష్టమని ఈ రెండు ఆవకాయ జాడీలూ తెస్తున్నావు మీ ఫ్రెండుకి మన వూరు నేతంటే ఇష్టపడుతుందని ఈ జత తివాచీలు తెస్తున్నావు. మీ చెల్లెలికి వాపసిచ్చెయ్యటానికిఈ చిన్న రుబ్బురోలు . వీటికి లగేజీ యే బోలెడంతయింది. ఇవన్నీ అవతలికి మొయ్యటం అంటే అంత తేలి కనుకున్నావా?".. " తేలికో, కష్టమో నా కనవసరం, ముందరిక్కడ్నుంచి నడవండి. లేకపోతే నేనిక్కడ గుండె ఆగిచచ్చేట్టున్నాను నేను చావకపోతే ఆ చచ్చినాడు దయ్యమయి నన్ను చంపేస్తాడు. పదండి బాబోయ ముందర!" నాకుచిర్రెత్తు కొచ్చింది అన్నాను. అది శవమయితే అవ్వచ్చు కానీ, వాడు దయ్యమయి నిన్ను చంపేస్తా డన్నది మాత్రం ట్రాష్! అసలు ఈ దయ్యాలూ, భూతాలూ వగైరా అన్నీ మన కంటికి కనిపించని దురదృష్టపు ప్రాణులనీ, అవి మనుషుల కన్నా బలహీనమైనవనీ నీకు తెలుసా? వాటికి మన భాష తెలీదని తెలుసా. అవ్వి మనుష్యుల్ని పట్టుకోవని నేననను. కాని, అవి చాలా అరుదుగా జరిగే సంఘటన . అవ్వి ఆవహించటమూ అంటే తమని ఆ బాధాకరమైన భూత శరీరం నుండి విడిపించమని మొర పెట్టుకోవటమని తెలుసుకో. మనుషుల్లో ఆ దయ్యాల కన్నా బలహీనులుండవచ్చు. అట్లాంటి సన్యాసుల్ని గనక అవి ఆవహిస్తే వాళ్లు మానసికంగానూ, శారీరకంగానూ, దెబ్బ తింటారు. సాధారణ మానవుడి జోలికి దయ్యాలు అసలు రావు. ఇవి పెద్దలు చెప్పే మాటలు. అసలు స్వామి వివేకానందుడుకి ఒక అనుభవమయింది ఆయన తపస్సులో కూర్చునున్నాడు. ఒక రాత్రి వేళ ఆయనకు అస్పష్టంగా ఏవేవో ఏడుపు ధ్వనులు వినిపించాయి. ఇట్లా కొన్ని రాత్రులు జరిగింది.ఆయన విషయం అర్థం చేసుకుని గంగానది ఒడ్డు కెళ్ళి ఆ దౌర్భాగ్య జీవాలకు పిండప్రదానం చేసి తర్పణం వదిలాడు. ఆ రాత్రి నుంచి ఇహ ఆయనకు ఆ శబ్దాలు మరి వినిపించ లేదట. ఇది ఆయన జీవిత చరిత్రలోని విషయం. ఇప్పుడు చెప్పు. నీ కథలో నువ్వు దయ్యాల్ని చూశానన్నావే! అవి ఏ ఆకారంలో ఉన్నాయి? పగలు కనిపించినయ్యా, రాత్రి కనిపించినయ్యా? అవి ఏ భాషలో మాట్లాడాయి? ఆ భాషకేదో లిపీ, గాడిద గుడ్డూ కూడా ఉన్నాయని రాశావే. నువ్వు కనీసం నీ కతకు చివర్లోనో మొదట్లోనే ' ఇదంతా పచ్చి కల్పన, నేను చేసి చూసి చచ్చిందేమీ లేదు. మీ రెవ్వరూ బిగుసుకు పోయి చావకండి' అని హెచ్చరికయినా చేశావా? ఏమీ లేదు. నీ పిచ్చి రాతలకి నీలో నుంచి పుట్టే రియాక్షన్‌ను నువ్వే ముందు ఇదుగో ఇక్కడే అనిభవిస్తున్నావు. అనుభవించు!" నాలో ఆవేశం చోటు చేసుకుంది నేను చటుక్కున లేచాను. సుందరి నా నడుం వాటేసుకుంది. ఇంచు మించు ఏడుపు స్వరంతో అంది " ఇంకెప్పుడూ దయ్యాల కథలు రాయనండి ప్లీజ్, పీజ్ ఇక్కడ్నుంచి వెళ్ళిపోదాం పదండి. పోనీ, తరవాత సామాన్లు మార్చుకోవచ్చు ముందర అవతలి సీట్లలోకి పోదాం రండి. పదండి. నామాట వినండి. "

నా ఆవేశం ఇంకా తగ్గలేదు. ప్రఖ్యాత రచయిత్రి ప్రియసఖి నా అర్థభాగం , నా సహధర్మచారిణి అయిన శ్రీమతి సుందరీదేవి వైపు పురుగును చూసినట్టు చూశాను. నాటకం ఫక్కీలో 'హు' అన్నాను. ఆమెను విదిలించుకుని లేచిపోయాను. వెళ్ళి పక్కనే ఉన్న డోర్ లో నుంచున్నాను. రెండు మూడు నిమిషాలు గడిచాయి.

హఠాత్తుగా కెవ్వుమని కేక వినిపించింది. నేను గడగడా అటడుగేసి తొంగి చూశాను. సుందరి చెవులు మూసుకుని భయంకరంగా మొహం పెట్టి సీటరు మీద గొంతు క్కూర్చుని మూటవైపు చూస్తుంది

'' ఏమిటి నీగోల'' అంటూ నేను ఆమె వైపు నడిచాను. '' రక్తమండి, రక్తం! అదుగో చూశారా, శవం నుంచి రక్తం  కారుతుంది. బాబోయ్. నేనిక్కడ ఒక్క క్షణం కూడా ఉండలేనండీ. హెహెహ్హెమండీ! సీహిహీహటు  మా హాహాహారి పోదామండీ'' అంటూ నా నడుం వాటేసుకుని సన్నగా ఏడుపు మొదలు పెట్టింది.

నేను సీటు కిందికి చూశాను నిజమే! రక్తం! లైటు కాంతిలో కూడా స్పష్టంగా కనిపిస్తున్న రక్తం. మూట మధ్య బాగంలోంచి రక్తం సన్నని పాయలాగా నెమ్మదిగా జాలువారుతూంది. నేను పరీక్షగా చూశాను. చెయ్యి జాపి ఆ ప్రవాహం అందుకోబోయాను. సుందరి- '' ఆఆ'' అని హఠాత్తుగా అరుస్తూ ఆ చెయ్యి వెనక్కి లాగింది. ఆ అరుపుకి అదిరిపడి దడుసుకున్నాను. ఏడుపు ఆపి సుందరి అంది '' అన్నీ ముదనష్టప్పన్లే! మీ కేమయినా అయితే నాగతేంటి? పిల్లల గతేంటి? నన్ను రైల్లోంచి కిందికి తోసేసి అప్పుడు మీ ఇష్టం. దాన్ని ముట్టుకోండి. అసలిక్కడ్నుంచిపోతే కాని శని వదలదు. పోతే పోనీండి వెధవ సామాను!'' సుందరి లేచి నా చెయ్యిపట్టుకుని రెండో వైపు ఖాళీగా ఉన్న సింగిల్ సీట్ల వైపు నన్ను బరబరా ఈడ్చి కెళ్ళింది. ఇద్దరం చెరొక సీట్లో కూర్చున్నాం అదేం ఖర్మో, పెట్టెకు అవతల చివర్న ఇంకో ఇద్దరు తప్ప ఇంక జనమే లేరు పెట్టెలో!

కూర్చునేవెనక్కి వంగి మూట వైపు చూశారు. సందేహం లేదు. రక్తమే! చిక్కగా ఉండటం వల్ల కాబోలు తొందరగా ప్రవాహం కిందికి జారటం లేదు. దడుసుకున్నానేమో నాకు వెన్నులో సన్నగా ఒణుకు మొదలయింది.క్రమంగా నాకు ఆలోచనలు రావటం మొదలుపెట్టాయి ఇది చిరివాడ శవం అయ్యుండదు. వాడు చచ్చి ఇరవయి నాల్గంటలయింది కదా, రక్తం గడ్డ కట్టుకోవాలి. ఇది బహుశా పుత్రికాత శవమో, భూతవాడ శవమో అయ్యుంటుంది. ఆడ శవమో, పెళ్ళయిందో లేదో! ఆత్మహత్య అయ్యుండదు. హత్య అయ్యుండదు! ఇది ఏ చావయినా శవాన్ని బహిరంగంగా బండీ ఎక్కేస్తారా? ఏదీ కాకుండా ఎట్లా ఉంటుంది? హత్యే అయ్యుంటుంది. ఈ హత్యలు అనేక రకాలు కదా! పేలుడు,పిసుకుడు, నరుకుడు, కాల్చుడు వగైరా రకాల్లో ఏ రకమో! ఏ రకమైనప్పటికీ రక్తం కారుతుంది. కనక తాజా శవమనేది మాత్రం ఖాయం! ఆ జమా జెట్టీ లెక్కించారు దీన్ని. ఇక్కడ పడేసి పారిపోయారు. అంటే, వాళ్లే ఈ హత్యకు బాధ్యులయ్యుండచ్చు. ఆ అదీ సంగతి! నేను అర్చుత్‌నాట్తో ఎక్కడ చెప్పిపోతానో అని కదూ వాళ్లు నన్ను వెంటాడారు! అయ్య బాబోయ్! వాళ్ళే హంతకులైతే , ఈ శవం ఏ బెజవాడలోనో పట్టుపడితే ఇంకేముంది. శవంతోపాటే ప్రయాణం చేసిన వాళ్ళం ప్రథమ సాక్ష్యులుగా నాకూ సుందరికీ కోర్టు చుట్టూ తిరిగి దిక్కుమాలిన గోల తప్పదు. సాక్ష్యం చెబితే ఆ ఇద్దరూ మమ్మల్ని చంపుతారు. చెప్పకపోతే ఆర్బత్ నాట్ చంపుతాడు. ఏమిటీ పెంటంతా?ఎరక్కపోయి ఈ పెట్టెలో ఎక్కారో, బాబో! బస్సులో వచ్చినా బాగుండి పోను. స్లోగా ప్రయాణం చేస్తే కథకు ప్లాట్లు దొరుకుతాయంది.  నా ప్రారబ్దం, దీని బొంద ప్లాట్లు. రేపు కోర్టు కెళ్లమను పెద్దప్లాటు దొరుకుతుంది. ఛీ,ఛీ, అమావాస్య వెళ్ళిందాకా దీని మొహం చూడకూడదు.''

సుందరి మీద చిరాకూ, కోపాలతో బాటు హత్యను గురించి భయంకూడా లోలోపల పెరిగి పోతూంది నాకు. ఇంత సేపట్నుంచీ సుందరి చేయి ముడుచుకుని  మోకాళ్లమీద తల ఆన్చి కూర్చుంది. రైలు వేగం క్రమంగా తగ్గింది. గుణదల స్టేషన్లో బండి ఆగింది. హఠాత్తుగా సుందరి అంది. ''పోనీ ఇప్పటయినా వెళ్లి మీ ఫ్రెండుతో శవం విషయం చెప్పిరాకూడదండీ!'' ఇందాక నచ్చని ఈ సలహా

ఇప్పుడు నాకు బ్రహ్మాండంగా నచ్చింది. చటుక్కున లేచాను. ప్లాట్ ఫారం మీదికి దిగి గార్డు పెట్టె వైపు నడవబోయాను. బండి కూతేస్తూనే బయలు దేరింది. నేను కంగారుగా నా డోర్‌లో కెక్కాను. ఇంకా ఎక్కనే లేదు - ఎక్కడనుంచి వూడి పడ్డారో ఆ జెమాజెట్టీలు లిద్దరూ నన్ను తోసుకుంటూ లోపలి కెళ్లారు. నే నొచ్చి కూర్చున్నాను. వాళ్ళిద్దరూ నా వైపు కోపంగా చూస్తూ వచ్చి మేమిద్దరం ఖాళీ చేసిన సీటర్లో కూర్చున్నారు. శవం వైపొకసారి చూసుకున్నారు.

వాళ్ళల్లో గుబురు మీసాల వాడన్నాడు. " మన మాట విషయం చెప్పటానికే నేంట్రా మాటి మాటికీ చెయ్యిచూపిస్తున్నాడు. మనవంటే ఏంటో తెలీదు గామాను! సెప్పరా సెప్పు మనమెవరం ఏంటో!'

"సెప్పుతా సెప్పుతా" అంటూ సన్నగా బక్క పలచగా ఉన్న రెండో వాడు పాంటు ఒక జేబులోంచి ఒక జామకాయ, రెండో జేబులోంచి ఒక చాకు తీశాడు. జామకాయని చేత్తో పట్టుకుని రెండో చేతిలోని చాకుతో దాన్ని కస్సున పొడిచాడు. చాకుతోనే దాన్ని పైకెత్తాడు. " ఇదీ మన ఇసయం!" అన్నాడు.

సుందరి మిర్రి మిర్రిగా వాడివైపు చూస్తూ ఉండిపోయింది. భయంతో నేను తలొంచుకుని కళ్ళుమూసుకున్నాను. వాడు పొడిచింది జామకాయను కాదు నన్ను ! వీడు పిస్తోలు హంతకుడు కాడు చాకుపోటు హంతకుడు! ఖాయం - నాకు కోర్టు కేసో చాకు పోటో ! అనుకున్నాన్నేను.

బండి వేగం మళ్ళీ తగ్గుతూండగా నేను స్పృహలో కొచ్చాను. వాళ్ళెటుపోయారో తెలీదు. సుందరి మాత్రం కొంగు నడుము చుట్టుకుని వీరనారీమణి పోజులో డోర్‌లో నిలబడుంది.

నేను తలెత్తి " పడతావ్, వచ్చి కూర్చో" అన్నాను.

"చాతకాని మాటలు మాట్లాడకండి. శవమంటే భయమేమో కాని, నాకు హంతకులంటే భయం లేదు, రాస్కెల్స్, వాళ్ళ అంతు చూస్తా నివ్వాళ బండి ఆగనివ్వండి."

మగత పోయి భయం రెట్టింపుగా నన్ను మళ్ళీ ఇప్పుడు ఒక్కసారిగా చుట్టు ముట్టింది. శవం, హంతకుల 'ఇదీ విసయం' డైలాగు - ఇవ్వి నామనస్సులో తుఫాను రేపుతున్నాయి. వీటికి తోడు సుందరి తన శూరత్వంతో ఏం చేసి ఎటు నెత్తిమీదికి తెస్తుందో అని భయం. శారీరకంగా మనుషులతో కలియ బడటమంటే నేను చాలా ఆలోచిస్తాను.

బండి బెజవాడ ప్లాట్ ఫారం మీద ఆగింది .

సుందరి చటుక్కున ప్లాట్ ఫారం మీదికి దూకింది. గబగబా వెళ్ళింది. అర్బత్‌నాట్‌ను వెంటపెట్టుకొచ్చింది. అతని వెనకాల ఇద్దరు కూలీ లొచ్చారు. అతను నన్ను చూసి "హల్లో శవం ఉందని ఇందాకనే చెప్పాల్సింది." అంటూ లోపలి కెక్కి చూసి " ఆ మూట విప్పండ్రా" అన్నాడు. కూలీలు విప్పారు. లోపలున్నది -కాల్‌గాస్ సిలిండరు. చుట్టూ రబ్బరు ట్యూబూ, బర్నరూ ప్లేట్లున్నూ!

పిలిచినట్టు ఎక్కడ్నుంచో వూడిపడ్డారు జమా జెట్టీలు

" ఇది మీదేనా?" అన్నాడు అర్బత్‌నాట్.

"అవు న్సార్!"

"లగ్గేజి టిక్కెట్టేది?"

చటుక్కున వాళ్ళిద్దరూ ఆముదం తాగిన మొహం పెట్టేశారు. "సార్, సార్! క్షమించండి, సార్, కంగార్లో ఎక్కేశాం. ఏదో ఈ తడవకి."

"డోన్టాక్ నాన్సెన్స్ ఒరేయ్! తీసుకురండ్రా బుక్ చేయిద్దాం"

నా కెందుకో అనుమానం వచ్చి మేము కూర్చునున్న వైపు సీటరు కిందికి చూశాను. అక్కడొక నీళ్ళ మడుగుంది. పార్టీషన్ కున్న కన్నం గుండా నీళ్ళు ఇవతల కొచ్చి గోనెసంచీ మీద రాసున్న పాత ఎర్రసిరా అక్షరాల్ని తడుపుతున్నాయి.

"కన్సొలేషన్స్, బ్రదర్! నీ కన్నా మా చెల్లెలే సాహసవంతురాలనుకుంటాను. మళ్ళీ కలుద్దాం" [illegible] కూలీలతో ఆ 'శవాన్ని' పట్టించుకుని వెళ్ళిపోయాడు. అతన్ని బతిమాలుతూ ఆ ఇద్దరు 'హంతకులూ' అతని వెంట పడ్డారు.

నేను దీర్ఘంగా నిట్టూర్చి నా సుందరి వైపు చూశాను. ఆమె కోపంగా నా వైపు చూసింది. నేను పులుకూ పులుకూ చూశాను. ఆమె తీక్షణంగా చూసింది. చూసి చూసి ఇద్దరం ఫకాల్న నవ్వుకున్నాం మా తెలివి తేటలకి !

( ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 19-1-83)

★★★ ★★★ ★★★

# షా

ఆ ఊళ్ళో కొత్తగా కాలేజీ పెట్టారు.

డిపార్టుమెంటుకి ఒక్కొక్కటి చొప్పున పోస్టులు అనుమతించి, ఆ మేరకు లెక్చరర్లను - కొంతమందిని బదిలీమీద, కొంత మందిని కొత్తగాను ఆ పోస్టుల్లో నియమించారు. ప్రిన్సిపాల్ తరువాత ముందరగా వచ్చి చేరిన వారు తెలుగు, జంతుశాస్త్రం, వృక్ష శాస్త్రం, భౌతిక శాస్త్రం, రసాయనిక శాస్త్రం లెక్చరర్లు. మిగతా లెక్చరర్లు వచ్చి చేరేటప్పటికి రెండు మూడు నెలలు పట్టింది. వీరందర్లోనూ తెలుగు, జంతుశాస్త్రం, వాణిజ్య శాస్త్రం చెప్పే వాళ్ళు గెజెటెడ్ లెక్చరర్లు కాగా, మిగతా సైన్సు వాళ్ళంతా అసిస్టెంటు లెక్చరర్లు.

తాము ముందుగా వచ్చి కాలేజీలో చేరిన కారణంగానూ, తను సహాయంతో ప్రిన్సిపల్ ఇంటర్మీడియట్, డిగ్రీ క్లాసులకు అడ్మిషన్లు చేసిన కారణంగానూ తామే కాలేజీకి పెద్దలమనే భావన సైన్సు లెక్చరర్లలో ప్రబలింది. ప్రిన్సిపాల్ తాలూకు మంచితనం కూడా దీనికి కొంత జత కలిసింది. ఫలితంగా, క్లాసుల్లో పాఠాలు చెప్పీ చెప్పనట్లుగా చెప్పటం, క్లాసులు వదిలే కామన్‌రూమ్‌లోకి వచ్చి కూర్చుని నోటికి వచ్చినట్లు వ్యర్థ ప్రసంగాలు చెయ్యటం, కాలేజీ పనిచేసే సమయంలో కూడా వీలైనప్పుడల్లా గోదావరి గట్టు మీదికి వెళ్ళి హోటల్లో కూర్చోవటం పరిపాటై పోయాయి. విద్యార్థుల భవిష్యత్తును, తర్వాత కొన్ని తరాల జాతిని దెబ్బతీసే ఈ వ్యవహారాన్ని చూసి బాధపడుతున్న లెక్చరర్లు కొందరు లేక పోలేదు. అయితే వాళ్ళ ప్రభావం కుర్రాళ్ళు మీద పనిచేసినంత గాఢంగా వాళ్ళతోటి లెక్చరర్ల మీద పని చెయ్యలేకపోయింది.